క్లుప్తంగా

ఘనంగా సామూహిక సత్యనారాయణ వ్రతం



సామూహిక సత్యనారాయణ వ్రతంలో పాల్గొన్న మహిళలు

సింహాద్రిపురం : శ్రీదేవి భూదేవి సమేత లక్ష్మి వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం సాయంత్రం శ్రావణ పౌర్ణమి సందర్భంగా సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించారు. అనంతపురం జిల్లా యల్లనూరుకు చెందిన వేదపండితులు సత్యనారాయణ స్వామి వ్రతం కథను చక్కగా వివరించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు



సీఐగా బాధ్యతలు చేపట్టిన హాజీవలి

పులివెందుల రూరల్ : మున్సిపాలిటీలో ట్రాఫిక్ అంతరాయం లేకుండా ప్రత్యేక చర్యలు చేపడతామని ట్రాఫిక్ నూతన సీఐగా బాధ్యతలు చేపట్టిన హాజీవలి తెలిపారు. సోమవారం ఆ యన పులివెందుల ట్రాఫిక్ సీఐగా బాధ్యతలు చేపట్టి మాట్లాడారు. మున్సిపాలిటీ పరిధిలో దుకాణాల ముందు వాహనాలను ఎక్కడపడితే అక్కడ నిలబిడితే చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే ప్రైవేట్ బస్సులను కూడా రోడ్లపై ఉంచితే చర్యలు తప్పవన్నారు. రాత్రి సమయాల్లో మాత్రమే లోడింగ్ అన్లోడింగ్ చేసుకోవాలన్నారు.

ప్రేమానురాగాలకు ప్రతీక రాఖీ పండుగ



సీఐకి రాఖీ కడుతున్న ప్రజాహిత బ్రహ్మకుమారి

వేంపల్లె : అన్నా–చెల్లెలు, అక్కా–తమ్ముళ్ల మధ్య ప్రేమానురాగాలకు ప్రతీక రాఖీ పండుగని ప్రజాహిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం నిర్వాహకులు విజయ, త్రివేణి, సౌమ్యలు తెలిపారు. సోమవారం జడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, టీడీపీ కన్వీనర్ రామమునిరెడ్డి, తహసీల్దార్ హరినాథ్‌రెడ్డి, సీఐ సురేష్‌రెడ్డిలతో పాటు పలువురికి వారు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలియజేశారు.

నేడు ఛాత్రాలయ విద్యార్థులకు అన్నదానం

కమలాపురం : స్థానిక ఎయిమ్ ఫర్ సేవ (అనాథ బాలుర ఛాత్రాలయం) కేంద్రంలో మంగళవారం విద్యార్థులకు మున్సిపల్ వైస్ చైర్మన్ మారుజోళ్ల శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం చేయనున్నారు. కమలాపురం మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని చిన్నారుల మధ్య కేక్ కట్ చేసి మాజీ ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేయనున్నారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో హార్టికల్చర్ స్టేట్ ఎక్స్ అడ్వైజర్ సంబటూరు ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం, రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేయనున్నారు. ఈ కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులు హాజరుకావలన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించండి



మున్సిపల్ చైర్మన్, కమిషనర్‌లకు వినతిపత్రం అందిజేస్తున్న బాధితులు

ఎర్రగుంట్ల : స్థానికంగా ఉన్న జగనన్న హౌసింగ్ కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఎంవీ సుబ్బారెడ్డి తెలిపారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి, కమిషనర్ రామకృష్ణయ్యలకు బాధితులతో కలసి వినతిపత్రం అందజేశారు. జగనన్న కాలనీలో రోడ్లన్నీ అధ్వానంగా ఉన్నాయన్నారు.

ఘనంగా పౌర్ణమి దీపోత్సవం



చౌడేశ్వరీ మాతకు దీపోత్సవం చేస్తున్న మహిళలు

వల్లూరు : మండలంలోని దుగ్గాయపల్లెలో వెలసిన చౌడేశ్వరీ మాత ఆలయంలో శ్రావణ పౌర్ణమి (రాఖీ పౌర్ణమి)ని పురష్కరించుకుని సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ మూర్తికి అభిషేకాలను నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు అమ్మవారికి పూలు, నిమ్మకాయలు సమర్పించి అమ్మవారి ఎదుట దీపోత్సవ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

లక్ష్యం నెరవేరేనా..?

- తగ్గిన వ్యవసాయ మార్కెట్ ఆదాయం
- పన్ను వసూళ్లలో సిబ్బంది నిర్లక్ష్యం
- 2024–25కి రూ.75 లక్షలు లక్ష్యం
- ఇప్పటి వరకు రూ.12.54 లక్షలు మాత్రమే వసూళ్లు



ఎర్రగుంట్ల మార్కెట్ యార్డు కార్యాలయం

ఎర్రగుంట్ల : యర్రగుంట్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆదాయం ఐదేళ్ల తర్వాత క్షీణించింది. సంపద సృష్టించాల్సిన చెక్‌పోస్టుల్లో వ్యాపారం మందకొడిగా సాగుతోంది. ఈ నేపథ్యంలో ఆదాయంపై తీవ్ర ప్రభావం పడింది. జూలై నెలలో జరిగిన వ్యవసాయ ఉత్పత్తుల క్రయవిక్రయాలను గతేడాదితో పోలిస్తే ఈసారి సఆదాయం గణనీయంగా తగ్గింది. గడిచిన ఐదేళ్లలో కరోనా సమయం మినహా మిగిలిన సమయాల్లో మంచి వసూళ్లు రాబట్టారు.

ఎర్రగుంట్ల వ్యవసాయ కమిటీ ఏర్పాటు

ఎర్రగుంట్ల పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ గతంలో కమలాపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో పరిధిలో ఉండేది. తర్వాత యర్రగుంట్ల వ్యవసాయ కమిటీ ప్రత్యేకంగా ఏర్పాటు చేసి యర్రగుంట్ల, ముద్దనూరు, కొండాపురం మండలాలను కలిపారు. యర్రగుంట్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో యర్రగుంట్ల, ముద్దనూరు, కొండాపురం మండలాలలో మూడు చెక్ పోస్టులు ఉన్నాయి. అయితే యర్రగుంట్ల పరిధిలో మాత్రం మార్కెట్ యార్డు కాంప్లెక్స్‌ను 2011లో 15 గదులు నిర్మించారు. వీటిని టెండర్ల ద్వారా అద్దెలకు ఇచ్చారు. 2022లో కొత్తగా 3 గదులను నిర్మించారు. వీటిని కూడా అద్దెకు ఇచ్చారు. యర్రగుంట్ల పరిధిలోని 18 గదులకు సంబంధించి ఏడాదికి రూ.48,228 ఆదాయం వస్తుంది. అలాగే ముద్దనూరు పరిధిలోని కూరగాయాల మార్కెట్ నుంచి ఏడాదికి రూ.24,962 ఆదాయం వస్తుంది.

తక్కువ బాడుగలు వసూళ్లు

యర్రగుంట్ల మార్కెట్ యార్డు కమిటీ కాంప్లెక్స్‌లోని గదులకు నెలకు రూ.4,019 బాడుగ వసూళ్లు చేస్తున్నారు. ఇందులో 16వ నంబరు గదికి రూ.5,222, 17వ నంబరు గదికి రూ.5,623, 18వ గదికి రూ.4,821, మిగిలిన 1 నుంచి 15 గదులకు ఒక్కొక్క గదికి రూ.4,019 బాడుగ వసూళ్లు చేస్తున్నారు. కాంప్లెక్స్‌కు కొంత దూరంలో నాలుగు రోడ్ల కూడలిలో అయితే చిన్నగదికే నెలకు రూ.10,000కు పైగా బాడుగులు పలుకుతున్నాయి. అయితే మార్కెట్ యార్డు కంప్లెక్స్‌లో మాత్రం తక్కువగా నిర్ణయించారు.

రూ.75 లక్షలు లక్ష్యం

2024–25 ఆర్థిక సంవత్సరంలో మార్కెట్ వసూళ్లు రూ.75 లక్షలు నిర్ధేశించారు. ఇప్పటి వరకు కేవలం రూ.12.54 లక్షలు మాత్రం వసూళ్లు చేశారు. నిర్ధేశించిన లక్ష్యం 2024 ఏప్రిల్ 1 నుంచి 2025 మార్చి 31 లోపు భర్తి చేయాలి. కేవలం 7 నెలలు మాత్రం గడువు మిగిలింది. పన్నుల వసూళ్లు చేపట్టకపోవడంపై విమర్శలు వస్తున్నాయి.

> **లక్ష్యాన్ని అధిగమిస్తాం**
>
> ప్రభుత్వం నిర్ధేశించిన లక్ష్యాన్ని ఈ ఆర్థిక సంవత్సరంలో అధిగమించేలా ప్రణాళికలు చేపట్టాం. చెక్‌పోస్టులలో ఎక్కడైనా జీరో వ్యాపారం జరిగితే చర్యలు తీసుకుంటాం. పర్యవేక్షణ పెంచి ఆదాయంపై దృష్టి సారిస్తాం
>
> – ప్రసాద్‌రెడ్డి (మార్కెట్ కార్యదర్శి, ఎర్రగుంట్ల)

సరళ రుణకేంద్రాన్ని సద్వినియోగం చేసుకోండి



సరళ రుణకేంద్రాన్ని ప్రారంభిస్తున్న జనరల్ మేనేజర్ పీఆర్ పడగెట వార్

పులివెందుల టౌన్ : పట్టణంలోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ (మెయిన్‌బ్రాంచ్)లో ఏర్పాటు చేసిన సరళ రుణకేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆ బ్యాంకు జనరల్ మేనేజర్ పీఆర్ పడగెటవార్ తెలిపారు. స్థానిక ఏపీజీబీలో కొత్తగా ఏర్పాటు చేసిన సరళ రుణ కేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ కేంద్రం నుంచి అవసరమైన రుణాలను అందించేందుకు బ్యాంక్ సిద్ధంగా ఉందన్నారు. అన్ని బ్యాంకులకంటే డిపాజిట్లపై ఏపీజీబీ అధిక వడ్డీ చెల్లిస్తుందన్నారు. కార్యక్రమంలో రీజినల్ మేనేజర్ శ్రీనివాస్ ప్రసాద్, కడప ఎస్ఆర్‌కే ఇన్‌చార్జి షరీఫ్, తదితర బ్యాంక్ మేనేజర్లు పాల్గొన్నారు.

రసాయనశాస్త్రంలో డాక్టరేట్



పులివెందుల టౌన్ : స్థానిక జెండామాను వీధికి చెందిన షేక్ మహమ్మద్ అలీకి జేఎన్టీయూ అనంతపురం సోమవారం డాక్టరేట్‌ను ప్రకటించింది. ఈ సందర్భంగా జేఎన్టీయూ కళాశాల రసాయన శాస్త్రవిభాగం ప్రొఫెసర్ దేవన్న పర్యవేక్షణలో ఎల్సీఎంఎస్/ఎంఎస్ ఉపయోగించి ఫార్మాసూటికల్ డ్రగ్స్‌లో జీనో టాక్సిక్ ఇంప్యూరిటీలను గుర్తించడం, తదితర వాటిపై డాక్టరేట్‌ను జేఎన్టీయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ నాగప్రసాద్‌నాయుడు ప్రకటించారు. డ్రగ్స్‌లో ఉండే జీనోటాక్సిక్ ఇంప్యూరిటీలను ఏ విధంగా గుర్తించాలి అనే అంశాలను ఈ పరిశోధన గ్రంథంలో ప్రచురించారు. ఈ పరిశోధనకు పత్రాలను వివిధ రకాల ప్రాముఖ్యత కలిగిన టేలర్ అండ్ ఫ్రాన్సిస్, విల్లీ, స్ప్రింగర్ జర్నల్స్‌లో ప్రచురింపబడ్డాయి. పరిశోధనా సిద్ధాంత గ్రంధాన్ని తన తండ్రి కీ.శే మహబూబ్‌బాషాకి అంకితం చేశానన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో పులివెందుల విద్యార్థుల ప్రతిభ



మెడల్స్ సాధించిన యువమార్షల్ ఆర్ట్స్ అకాడమీ విద్యార్థులు

పులివెందుల టౌన్ : ఈనెల 17, 18వ తేదీల్లో విజయనగరంలోని రాజీవ్ స్టేడియంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో పులివెందుల యువమార్షల్ ఆర్ట్స్ అకాడమీ విద్యార్థులు ప్రతిభ కనపరిచి పతకాలు సాధించారు. అండర్–46 కేజీ కేటగిరిలో మంజు, అండర్–53 సిరివెన్నల, అండర్–63 చరణ్‌కుమార్‌లు సిల్వర్ మెడల్స్‌ను సాధించారు. అండర్–80 కేజీ విభాగంలో గురువేంద్ర బ్రోంజ్ మెడల్ సాధించారు. అలాగే కడప ఓవల్ థర్డ్ ఛాంపియన్షిప్ కైవసం చేసుకున్నట్లు మాస్టర్ దినేష్ తెలిపారు. సిల్వర్ మెడల్ సాధించిన విద్యార్థులు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు.

గండికోట జలాలు విడుదల



నీటిని విడుదలకు చేస్తున్న ఎమ్మెల్యే చైతన్యరెడ్డి

ముద్దనూరు : గండికోట జలాశయం నుంచి గాలేరు–నగరి ప్రధాన కాలువ ద్వారా వామికొండ, సర్వారాయసాగర్ జలాశయాలకు సోమవారం కృష్ణా జలాలను విడుదల చేశారు. ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి భూపేష్‌రెడ్డిలు మండలంలోని శెట్టివారిపల్లె క్రాస్ రెగ్యులేటర్ నుంచి జీఎన్ఎస్ఎస్ కాలువ ద్వారా గండికోట జలాలను విడుదల చేశారు. రోజుకు 500 క్యూసెక్కుల చొప్పున రెండు ప్రాజెక్టులకు నీటిని విడుదల చేస్తున్నట్లు జీఎన్ఎస్ఎస్ డీఈ ఉమామహేశ్వరరావు తెలిపారు.

రైతులకు అన్యాయం చేస్తే చర్యలు తప్పవు

పులివెందుల రూరల్ : పులివెందుల ప్రాంతంలో విక్రయాలు చేసేందుకు చీనీకాయలను మార్కెట్‌కు తీసుకువస్తే దళారులు రైతులను మోసం చేస్తున్నారని ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి వారిపై ఆగ్ర హం వ్యక్తం చేశారు.

సోమవారం చీనీకాయల మార్కెట్ వద్దకు వెళ్లి అక్కడ జరుగుతున్న వేలం పాటను ఆయన పరిశీలించారు. చీనీ మార్కెట్‌లో రైతులకు అన్యాయం జరుగుతుందని అక్కడున్న రైతులు ఆ యన దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆ యన మాట్లాడుతూ మార్కెట్‌యార్డులో పనిచేస్తు న్న అధికారులు, సిబ్బంది వ్యాపారులతో కుమ్మక్కై రైతులను మోసం చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మార్కెట్‌లో రూ.20 వేలకు కొనుగోలు చేసిన చీనీ కాయలను రూ.10 వేలు, రూ.5 వేలకు కొనుగోలు చేసిన కాయలను ఒకే లారీలో బయటకు తీసుకెళ్లడం జరుగుతుందన్నారు. దీనినిబట్టి చూస్తే ఇక్కడ కొనుగోలు చేసేటప్పుడు వేరువేరు ధరలు చెల్లిస్తున్నారు కానీ... విక్రయించేటప్పుడు మాత్రం అన్ని ఒకే ధరకు విక్రయిస్తున్నారన్నారు. దీనివల్ల రైతులకు నష్టం జరుగుతుందన్నారు. ఇప్పటికైనా వ్యాపారస్తులు, అధికారులు తమ పద్ధతులను మా ర్చుకుని రైతులకు లాభాలు తెచ్చేవిధంగా చూడాలని ఆయన సూచించారు.

చెత్తపై పన్ను రద్దుచేయాలి



కార్యాలయంలో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నాయకులు

జమ్మలమడుగు : ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారంలోనికి వస్తే చెత్తపై పన్ను రద్దుచేస్తామని హామీ ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వం చెత్తపై పన్ను రద్దు చేయాలని సీపీఐ నాయకుడు ప్రసాద్ సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆర్వోకు వినతి పత్రం అంజేశారు. అనంతరం కార్యాలయంలో చెత్తపై పన్ను రద్దు చేయాలంటూ నిరసన వ్యక్తం చేశారు.

సాగు, తాగునీటికి నీటిని నిల్వ చేస్తున్నాం

కొండాపురం : గండికోట జలాశయం నుంచి ఎత్తిపోతల పథకం ద్వారా పైడిపాళెం జలాశయం, చిత్రావతి బ్యాలెన్స్ రిజర్వాయర్‌లల్లో కృష్ణాజలాలు నింపి సాగు, తాగునీటి కోసమే నీటిని నిల్వ చేస్తున్నామని జలవనురుల శాఖ ఈఈ కృష్ణారెడ్డి తెలిపారు.

సోమవారం కొండాపురంలోని గండికోట ఎత్తిపోతల పథకం వద్ద మాజీ ఎమ్మెల్సీ రవీంద్రనాథ్ రెడ్డి మోటార్లను ఆన్ చేసి నీటిని విడుదల చేశారు. అనంతరం ఈఈ మాట్లాడుతూ సీబీఆర్ జలాశయంలో ప్రస్తుతం 3.2 టీఎంసీలు ఉండగా మరో 5 టీఎంసీలు నిల్వచేస్తామన్నారు. గండికోట ఎత్తిపోతల పథకం ద్వారా రెండు మోటార్లు లిఫ్ట్–1, లిఫ్ట్ –2 స్టేజిల మోటార్లు ఆన్ చేసి 1000 క్యూసెక్కులనీటిని పంపింగ్ చేస్తున్నామన్నారు. పైడిపాళెం ఈఈ రాజశేఖర్ మాట్లాడుతూ పైడిపాళెం రిజర్వాయర్‌లో పూర్తి సామర్థ్యం 6 టీఎంసీలు ఉండగా అందులో ప్రస్తుతం 3 టీఎంసీలు నిల్వ ఉందన్నారు. నాలుగు మోటర్ల ద్వారా 400 క్యూసెక్కుల నీటిని పంపింగ్ చేస్తున్నామన్నారు. పైడిపాళెం జలాశయంలో 2.5 టీఎంసీలు నిల్వ చేసి మొత్తం 5 టీఎంసీలు డ్యాంలో నింపుతామన్నారు.

రెవెన్యూ సమస్యలకు సత్వర పరిష్కారం



రైతులనుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్న ఆర్డీఓ

జమ్మలమడుగు : రెవెన్యూ సమస్యలను త్వరగా పరిష్కరిస్తామని ఆర్డీఓ శ్రీనివాస్ తెలిపారు. సోమవారం ఆయన కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో రైతులను నుంచి ఫిర్యాదులను స్వీకరించి మాట్లాడారు. రైతులు తమ పేర్ల మీద ఉన్నభూమి మరో వ్యక్తుల పేర్ల మీద ఆన్‌లైన్‌లో ఎక్కించారనే ఫిర్యాదులు వచ్చాయన్నారు. నిజమైన లబ్ధిదారుల భూములను ఆన్‌లైన్‌లో ఎక్కిస్తామన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇంజనీరింగ్ విద్యార్థి మృతి

చింతకొమ్మదిన్నె : కడప నగర శివార్లలోని ఊటుకూరు ఆర్టీఏ కార్యాలయం సమీపంలో అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఆవుల సందీప్‌కుమార్(21) విద్యార్థి మృతి చెందాడు. చింతకొమ్మదిన్నె సీఐ శివశంకర్ నాయక్ తెలిపిన వివరాల మేరకు.. కడప నగరంలోని అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో చదువుతున్న సందీప్‌కుమార్ తన స్నేహితునితో కలిసి కడపకు మోటార్ సైకిల్‌పై వెళుతుండగా ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సందీప్‌కుమార్ రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. సందీప్‌కుమార్‌తో పాటు మోటార్‌సైకిల్‌పై వున్న అతని స్నేహితుడు పుల్లాసి సంతోష్ తీవ్రగాయాలతో చికిత్స పొందుతున్నాడు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

వాపాడు : పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యంగా ఉంటారని మండల ఆరోగ్య విస్తరణాధికారి ఎం.రాఘవయ్య అన్నారు. మండలంలోని అల్లాడుపల్లె గ్రామంలో సోమవారం లార్వా. పీవలర్ నిర్వహించి, వాటిపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆరోగ్య విస్తరణాధికారి మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఆర్యవైశ్య మహిళా మండలి నూతన కార్యవర్గం



ప్రమాణస్వీకారం చేస్తున్న ఆర్యవైశ్య మహిళా మండలి నూతన కార్యవర్గం

వేంపల్లె : స్థానిక శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో వేంపల్లె ఆర్యవైశ్య మహిళా మండలి నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం జరిగిందని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు రాయవరం సురేంద్ర తెలిపారు. ఆర్యవైశ్య మహిళా మండలి నూతన అధ్యక్షురాలుగా పచ్చిపులుసు ప్రవీణా, ఉపాధ్యక్షురాలుగా బైరిశెట్టి నాగలక్ష్మి, గోనుగుంట్ల సంధ్యారాణి, కార్యదర్శిగా వడ్లకుంట మృధుల, కోశాధికారులుగా శ్రీదేవి, శ్రావణి, ఉప కార్యదర్శులుగా నాగవాణి, శైలజలతో పాటు మరి కొందరు కార్యవర్గ సభ్యులుగా ప్రమాణస్వీకారం చేశారు. మహిళా మండలి ఆధ్వర్యంలో పలు ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలు నిర్వహించి ఆర్యవైశ్య సంఘం అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో గండి శ్రీ వాసవి ఆర్యవైశ్య నిత్యాన్నదాన సత్రం గౌరవ అధ్యక్షుడు శివరావు, అధ్యక్షుడు మురళీకిషోర్, ఉపాధ్యక్షుడు బాలగంగాధర్, వేంపల్లె ఆర్యవైశ్య సంఘం సెక్రటరీ వెంకటేశ్వర్ల గుప్తా, ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ట వేడుకలు



ప్రతిష్టించిన రుక్మిణి సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి విగ్రహాలు



విగ్రహ ప్రతిష్టలో పాల్గొన్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

సింహాద్రిపురం : స్థానికంగా పునఃనిర్మించిన శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు వైభవంగా జరిగాయి. సోమవారం ఉదయం ఆలయంలో స్వామివారి విగ్రహాలను ప్రతిష్టించారు. ఈ విగ్రహ ప్రతిష్ఠ వేడుక కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి హాజరై స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అంతకు మునుపు ఎంపీని ఆలయ అర్చకులు, ఆలయ నిర్వాహకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా ఆలయంలో స్వామివారికి యంత్రస్థాపన, విమాన గోపురకలశ ప్రతిష్ఠ, మహామంగళహారతి, స్వామివారి విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ పునఃనిర్మాణానికి ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి సహకారంతో ఎండోమెంట్ శాఖ ద్వారా రూ.కోటి నిధులను మంజూరు చేయించి ఆలయ నిర్మాణం పూర్తిచేసేందుకు సహకరించారు. ఈ వేడుకలను మూడు రోజులుగా వైభవంగా నిర్వహించారు. ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి మహిళలు రక్షాబంధన్ (రాఖీ)లు కట్టి ఆశీర్వాదం తీసుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్సీపీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, వైసీపీ నాయకులు రామ్మోహన్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, బ్రహ్మానందరెడ్డి, ద్వారకనాథరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వేములలో..

వేముల : పెర్నపాడు గ్రామంలోని శివాలయంలో సోమవారం పురోహితులు విగ్రహ ప్రతిష్ఠను ఘనంగా నిర్వహించారు. అలాగే ధ్వజ స్తంభంను ప్రతిష్ఠించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. చెక్కభజన, కోలాటం, తాళాల భజనలు భక్తులను ఆకట్టుకున్నాయి. మూడు రోజుల పాటు భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. వైఎస్సార్సీపీ మండల ఇన్‌చార్జి నాగెళ్ల సాంబశివారెడ్డి, జడ్పీటీసీ వెంకటబయపు రెడ్డి, పీసీబీ డైరెక్టర్ మరక శివకృష్ణారెడ్డిలు విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొని పూజలు నిర్వహించారు.

ఘనంగా వరల్డ్ ఫొటోగ్రఫీ దినోత్సవం



వేంపల్లెలో కేక్ కట్ చేస్తున్న ఫొటోగ్రాఫర్లు

వేంపల్లె : వరల్డ్ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని వేంపల్లె ఫొటో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సోమవారం స్థానిక వైఎస్సార్ మెమోరియల్ పార్కులో కేక్ కట్ చేసి వేడుకలు చేపట్టారు. తమకు ఏదైనా సమస్యలు వస్తే అందరూ కలిసికట్టుగా పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఫొటో గ్రాఫర్లు, వీడియో గ్రాఫర్లు, డ్రోన్, మిక్సింగ్ ఆపరేటర్లు, తదితరులు పాల్గొన్నారు.



పులివెందులలో లూయిస్‌డే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఫొటోగ్రాఫర్లు

పులివెందులలో..

పులివెందుల రూరల్ : పట్టణంలోని పాతబస్టాండు సమీపంలో ఉన్న అయ్యప్ప స్టూడియోలో సోమవారం ఫొటోగ్రఫీ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పులివెందుల వైఎస్సార్ ఫొటో అసోసియేషన్ అధ్యక్షుడు అల్లాబకాష్ ఆధ్వర్యంలో కెమెరా సృష్టికర్త లూయిస్ డే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఫొటోగ్రాఫర్లు, తదితరులు పాల్గొన్నారు.

అనుమతిలేని ప్లాట్లకు రిజిస్ట్రేషన్ ఉండదు

మున్సిపల్ కమిషనర్ రామకృష్ణయ్య

ఎర్రగుంట్ల : మున్సిపల్ పరిధిలో అనుమతి లేకుండా వేసిన ప్లాట్లలోని స్థలాలకు ఎలాంటి రిజిస్ట్రేషన్ ఉండదని మున్సిపల్ కమిషనర్ రామక్రిష్ణయ్య తెలిపారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మున్సిపల్ పరిధిలో ఉన్న సర్వేనంబర్లు 720(పీ)లో 5 ఎకరాలు, 719(పీ)లో 5.5 ఎకరాలు ,711, 712, 714లో 9 ఎకరాలు, 734(పీ)లో 2 ఎకరాలు, 732(పీ)లో 4 ఎకరాలు, 649(పీ)లో 2 ఎకరాలు, 631/1, 631/2లో 2 ఎకరాలు, 630(పీ)లో 1.32 ఎకరాలు, 622(పీ), 623లలో 5 ఎకరాలు, 151–3, 292–3లో 2.56 ఎకరాలు, 318/1ఎ, 319/1లో 5.8 ఎకరాలు, 126(పీ), 127(పీ)లో 2.06 ఎకరాలు, 299/1, 300/2, 301/1ఎ, 302లలో 13.2 ఎకరాలు, 149/1లో 4.14 ఎకరాలు, 63/ఎ, 64/ఎ, 56లలో 3.5 ఎకరాలు, 68ఎ, 69ఎ(పీ)లలో 2.02 ఎకరాలు, 297–ఎలో 0.95 ఎకరాలు, 344/ఎ, 337(పీ)లలో 2.23 ఎకరాలు, 164, 189(పీ)లలో 7 ఎకరాలు, 338–1, 2, 3, 4లో 3.67 ఎకరాలు, 635లో 5.35 ఎకరాలు, 735(పీ), 736(పీ)లలో 1.5 ఎకరాలు ఉన్నాయి. ఈ స్థలాలలో ఉన్న లేఅవుట్‌లకు ఎలాంటి అనుమతులు లేవన్నారు. ప్లాట్లను కొనుగోలు చట్టవిరుద్ధమని, వీటిని కొనుగోలు చేయకూడదన్నారు. ఈ స్థలాలకు రిజిస్ట్రేషన్ చేయరన్నారు. ఈ స్థలాలలో భవన నిర్మాణానికి అనుతులు ఇవ్వరన్నారు. వినియోగదారులు గమనించాగలన్నారు.

ఉమ్మడి భూములను కాపాడుకుందాం



తాహసీల్దార్ లక్ష్మిదేవికి వినతిపత్రం అందజేస్తున్న ఉమ్మడి వనరుల కమిటీ సభ్యులు

వీరపునాయునిపల్లె : మండలంలోని సాగుకు పనికిరాని ఉమ్మడి భూములను కాపాడేందుకు చర్యలు చేపట్టాలని ఉమ్మడి వనరుల సమితి అధ్యక్షుడు బ్రహ్మం తెలిపారు. సోమవారం మండలంలోని ఉపాధి హామీ కార్యాలయంలో నిర్వహించిన మండలస్థాయి ఉమ్మడి వనరుల అభివృద్ధి సమితి సామావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని 22 పంచాయతీల్లో సాగుకు పనికిరాని భూములను పీఓబీలో నమోదు చేసి కాపాడాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులపై ఉందన్నారు. జిల్లా క్లస్టర్ కో ఆర్డినేటర్ భాస్కర్ మాట్లాడుతూ మండలంలోని సాగుకు పనికిరాని భూముల్లో పచ్చదనాన్ని పెంపొందించి బావితరాలకు అందించవలసిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. అనంతరం తహసీల్దార్ లక్ష్మిదేవికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సోషియల్ వర్కర్ ఐ.వి.రమణ, ఉపాధి పీల్డ్ అసిస్టెట్ కేశవ, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసుస్టేషన్‌కు సిబ్బంది కావలెను

- అప్‌గ్రేడ్ స్టేషన్‌లో అవస్థలు
- 19 మందికిగాను 8 మంది కానిస్టేబుళ్లు



సిబ్బంది కొరత వున్న పోలీసుస్టేషన్

ముద్దనూరు : మండల వ్యాప్తంగా శాంతి భద్రతలను పర్యవేక్షించే అప్‌గ్రేడ్ పోలీసుస్టేషన్‌లో కింది స్థాయి సిబ్బంది కొరతతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సుమారు ఏడాదిన్నరగా కానిస్టేబుళ్ల కొరతతో పోలీసుల విధులు ఇబ్బందికరంగా మారా యి. స్థానిక స్టేషన్‌లో 19 మంది పోలీసు కానిస్టేబుళ్లు విధులు నిర్వహించాల్సి వుంది. అయితే ప్రస్తుతం 8 మంది కానిస్టేబుళ్లు మాత్రమే విధుల్లో వున్నారు. వీరిలో ఇరువురు కంప్యూటర్ విధుల్లో వుండగా, మరో ఇరువురు కోర్టు విధులకు హాజ రవుతుంటారు. ప్రస్తుతం కేవలం ముగ్గురు కానిస్టేబుళ్లు మాత్రమే శాంతి భద్రతల విధుల్లో వున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. సిబ్బంది కొరతతో సమస్యలు తలెత్తుతున్నట్లు స్థానిక ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అప్‌గ్రేడ్ పోలీసుస్టేషన్‌లో కానిస్టేబుళ్లను నియామకానికి ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.